కెరటం న్యూస్ ప్రత్యేకం

# బలిపీఠంపై ఎల్ఐసీ

## ఎల్ఐసీ ఏఓఐ ఆలిండియా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్ మంజునాథ్



లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి) ప్రపంచవ్యాప్తంగా ఉన్న టాప్ టెన్ ఇన్సూరెన్స్ కంపెనీలలో మూడవ స్థానంలో ఉంది. భారతదేశంలోని 23 ఇన్సూరెన్స్ కంపెనీల పోటీ మధ్య నంబర్ వన్ గా కొనసాగుతుంది. తద్వారా మార్కెట్లో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తుంది. దీనికి ప్రధాన కారణం కంపెనీకి రాయబారులుగా పనిచేస్తున్న 14 లక్షల మంది ఎల్ఐసి ఏజెంట్లు. వారు తమ పాలసీ అమ్మకాలు మరియు సేవల ద్వారా పాలసీదారుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టుకున్నారు. దీనివల్లనే ఎల్ఐసి ఈ స్థాయికి ఎదిగింది.

**ప్రభుత్వానికి, ప్రజలకు కల్పవృక్షంగా పనిచేస్తున్న ఎల్ఐసి**

కేంద్ర ప్రభుత్వ పంచవర్ష ప్రణాళికల నుండి దేశంలోని అభివృద్ధి పనులు, భారీ నిర్మాణాలు, రాష్ట్ర ప్రభుత్వ మరియు స్థానిక సంస్థలు చేపట్టే ప్రజాప్రయోజన ప్రాజెక్టుల కొరకు సుమారు రూ.39 లక్షల కోట్ల స్వల్ప మరియు దీర్ఘకాలిక రుణాలు ప్రజల సంక్షేమం కోసం ఎల్ఐసి అందించింది. ప్రస్తుతం ఎల్ఐసి లైఫ్ ఫండ్ రూ. 44.31 లక్షల కోట్లు, అదేవిధంగా 2025 మార్చినాటికి 54.52 లక్షల కోట్ల ఆస్తులను కలిగి ఉన్నది. గత 68 సంవత్సరాలుగా దేశ ప్రజల సహకారంతో ఈ భారీ మొత్తాన్ని సేకరించగలిగింది.

**ప్రజా ప్రయోజనం పేరుతో ప్రైవేట్ కంపెనీల అనుకూల సంస్కరణలు**

నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైన తర్వాత ప్రభుత్వ బీమా సంస్థలను అస్థిరపరచి, ఇన్సూరెన్స్ మార్కెట్ ను ప్రైవేటు కంపెనీలకు అప్పగించే కార్యక్రమం జరుగుతుంది. మొదటి సారిగా 1982లో ఇన్సూరెన్స్ రంగాన్ని ఐదు భాగాలుగా విడగొట్టేందుకు ప్రయత్నం చేసి ఉద్యోగ, కార్మికుల ప్రతిఘటన కారణంగా ప్రభుత్వం వెనక్కు తగ్గింది. అయితే ప్రజా ప్రయోజనాల కోసం అని చెప్పి 1994లో ఆర్. యన్ మల్హోత్రా కమిటీని, 2009లో డి. స్వరూప్ కమిటీని నియమించారు. ఈ రెండు కమిటీలు కూడా పాలసీదారులు, ఏజెంట్లు మరియు ఎల్ఐసి సంస్థకు నష్టం కలిగించే అనేక సిఫార్సులు చేసి పరోక్షంగా ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు తోడ్పడే పని చేశాయి. వీటి ఫలితంగా బీమా చట్టాన్ని సవరించడం, భీమా రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పడవులను అనుమతించడం, ప్రభుత్వ కార్పోరేషన్ గా ఉన్న ఎల్ఐసి ని కంపెనీగా మార్పు చేయడం మొదలైన పరిణామాలు జరిగాయి. యూపీఏ 1,యూపీఏ 2 ప్రభుత్వాల సమయంలో వామపక్ష పార్లమెంటు సభ్యుల సహకారంతో వీటిని అమలు కాకుండా ఎల్ఐసి ఎఒఐ మిగతా యూనియన్లను కలుపుకొని పోరాటం చేసి నిలుపుదల చేయించ గలిగింది. కానీ 2014లో మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సిఫార్సులను వేగంగా అమలు చేశారు. ఫలితంగా ఇన్సూరెన్స్ మార్కెట్లో ప్రైవేట్ కంపెనీలో ఆధిపత్యం క్రమేణా పెరుగుతుంది.

**ఆచరణలో అబద్ధం అని రుజువైన ప్రజాప్రయోజనం**

ఈ రెండు కమిటీల సిఫార్సుల మేరకు అమలు చేసిన విధానాల వల్ల 2022లో ఐపీఓ ద్వారా 3.5 శాతం ఎల్ఐసి షేర్లను విక్రయించి 20,557 కోట్లు కేంద్ర ప్రభుత్వం పొందింది. అంతేగాక ఈ సంవత్సరం 10 శాతం షేర్లను, 2030 నాటికి 25% షేర్లను విక్రయించే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుంది. దీనివల్ల ఎల్ఐసికి రావాల్సిన ఆరు లక్షల కోట్ల ప్రీమియాన్ని ఇప్పటి వరకు కోల్పోయింది. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే ప్రమాదం ఉంది. అదేవిధంగా గతంలో ప్రభుత్వ పథకాలలో పెట్టుబడి పెట్టి తద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రజలకు చెల్లించే అవకాశం ఇప్పుడు లేకుండా పోయింది. 2008 - 2013 మధ్యలో పాలసీదారులకు బోనస్ వెయ్యికి కి రూ.70/- నుండి రూ. 110/- వరకు ఎల్ఐసి ఇచ్చేది. అది క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం రూ . 30/- నుండి రూ. 40/- మధ్యకు చేరింది. ఈ కారణంగా పాలసీదారులకు చెల్లించే డెత్ క్లెయిమ్ కానీ, మెచ్యూరిటీ క్లెయిమ్ కానీ పాలసీదారులకు లాభదాయకంగా ఉండడం లేదు. ప్రైవేట్ ఇన్సూరెన్సులు పుంజుకోవడానికి ఇది ఒక ప్రధాన కారణంగా ఉంది. సింగిల్ ప్రీమియం విభాగంలో ప్రైవేట్ కంపెనీలు ఈపాటికే ఎక్కువ మార్కెట్‌ను ఆక్రమించేశాయి. రాబోయే కాలంలో పాలసీదారులకు మెరుగైన లాభాలు ఇవ్వడం సాధ్యం కాని పరిస్థితి ఏర్పడుతుంది. 2014 నుండి ఎల్ఐసి లాభాలను ఆర్థిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతి ఏటా 7వేల కోట్ల రూపాయలను డివిడెంట్ రూపంలో చెల్లిస్తున్నప్పటికీ పాలసీదారులకు బోనస్ రేట్లు పెంచలేక పోతుంది. మరోవైపు 2024 అక్టోబర్ నుండి ప్రీమియం రేట్లు పెంచింది. దీనివల్ల ఎల్ఐసి పట్ల నమ్మకం తగ్గడమే కాకుండా కొత్త వ్యాపారం నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

**కుండకు చిల్లులు పెట్టి నింపమన్నట్లుగా ఉన్న నూతన మార్పులు**

కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని ఐ ఆర్ డి ఎ ఐ సూచనల మేరకు 2024 అక్టోబర్ నుండి ఇన్సూరెన్స్ పాలసీలలో అనేక కొత్త మార్పులు వచ్చినాయి. దీనివల్ల గతంలో పాలసీ సరెండర్ కి మూడు సంవత్సరాలు తర్వాతే అవకాశం ఉండేది. దానిని 2000 సంవత్సరంలో రెండు సంవత్సరాలకు, తాజాగా ఒక సంవత్సరానికి కుదించారు. మరోవైపు పాలసీదారుడు ఆరు సంవత్సరాల పాటు పాలసీని కొనసాగించకపోతే ఆ పాలసీ ద్వారా ఏజెంట్ ఆపాటికి పొందిన కమిషన్‌ను వెనక్కి తీసుకోవాలనే విధానాన్ని (క్లా-బ్యాక్ కమీషన్) ప్రతిపాదించారు. ఒకవైపు పాలసీ సులభంగా రద్దు చేసుకునే అవకాశం పాలసీదారుడికి ఇచ్చి, మరోవైపు పాలసీ రద్దు అయితే ఆ పాసీపై ఏజెంట్ ఆపాటికే పొందిన కమిషన్‌ను తిరిగి వెనక్కి తీసుకుంటామని చెప్పడం ప్రభుత్వం యొక్క అసలు ఉద్దేశాన్ని స్పష్టం చేస్తుంది. పాలసీదారులకు ప్రీమియం రేటు పెంచడంతోపాటు పాలసీ లోన్లపై 8 శాతం నుండి 10 శాతం వడ్డీని వసూలు చేస్తుంది. మరోవైపు ఏజెంట్లకు కొత్త సౌకర్యాలు కల్పించకపోగా ఉన్న వాటిని తొలగించే ప్రయత్నం చేస్తుంది. రోజు రోజుకి అన్ని రకాల సరుకుల రేట్లు పెరిగిపోతూ ఉంటే 1956 నుండి ఎల్ఐసి ఏజెంట్లకు కమిషన్ ఒకసారి కూడా పెంచలేదు. పెంచకపోగా 2024 అక్టోబర్లో తీసుకువచ్చిన మార్పుల వల్ల 7 శాతం కమిషన్ తగ్గించబడింది. దీనితోపాటు బీమా సుగం పేరుతో ఒక ఏజెంట్ అనేక ఇన్సూరెన్స్ కంపెనీలలో వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించే ప్రతిపాదనలు చేస్తున్నారు. ఇది అమలు అయితే ఎల్ఐసి ఏజెంట్ల పరిస్థితి "ఎండమావులను చూసి బిందెలో నీళ్లు పారబోసుకున్న" సామెత లాగా తయారవుతుంది. వీటితోపాటు ఆన్లైన్లో పాలసీలు విక్రయించడం, హెల్త్ ఇన్సూరెన్స్ లో ఉన్నట్లుగా పాలసీ పోర్టబిలిటీ జీవిత బీమా లో కూడా ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఇది ఎల్ఐసి సంస్థకు పెద్ద ఎదురు దెబ్బ,ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు పెద్ద వరంగా మారుతుంది.

**గత పోరాటాల స్ఫూర్తితో ఉద్యమాలను ఉధృతం చేయడమే పరిష్కారం**

"నిద్రపోయేవాడిని లేపవచ్చు కానీ నిద్ర నటించేవాడిని లేపలేము" అన్న సామెత లాగా ప్రభుత్వ విధానాల వల్ల ఎల్ఐసి సంస్థకు, పాలసీ దారులకు, ఎల్ఐసి ఏజెంట్లకు అందరికీ నష్టమని ప్రభుత్వానికి తెలిసే ఈ విధానాలను ప్రోత్సహిస్తుంది. కాబట్టి ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టాలంటే గతం కంటే మరింత ఎక్కువ సంఘటితంగా పోరాడాలి. ఎల్ఐసి పరిరక్షణ, ఏజెంట్ల హక్కుల సాధన కోసం ఎల్ఐసి ఎఒఐ 2006 నుండి ఇప్పటివరకు పార్లమెంటు వద్ద 13 సార్లు, ఐఆర్డీఏఐ ముందు 3 సార్లు, ఎల్ఐసి ప్రధాన కార్యాలయం ముందు 4 సార్లు, జోనల్ కార్యాలయాల వద్ద 10 సార్లు ధర్నాలు నిర్వహించాము. డివిజనల్ ఆఫీసులు, బ్రాంచ్ ఆఫీసుల వద్ద అనేకసార్లు నిరసనలు చేసాము. ఫలితంగా తాజాగా సాధించిన జీఎస్టీ రద్దు డిమాండ్ తో సహా అనేక డిమాండ్లను సాధించుకోగలిగాము. ఇదే పోరాట స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలు చేయాల్సిన బాధ్యత ఎల్ఐసి ఏజెంట్ల పైన ఉన్నది. ఈ పోరాటంలో ఉద్యోగులను, పాలసీదారులను, భావస్వరూప్యం కలిగిన వ్యక్తులను, సంస్థలను కలుపుకొని ఐక్య ఉద్యమాలను నిర్వహించాలి. ఆ ఉద్యమాలకు నవంబర్ 8,9 తేదీలలో ఖమ్మంలో జరుగుతున్న ఎల్ఐసి ఎఒఐ 6వ జోనల్ మహాసభలు దిశా నిర్దేశం చేయనున్నాయి.

**యల్.మంజునాథ్**
**ఆల్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్**
**ఎల్ఐసి ఎఒఐ సెంట్రల్ కమిటి**
**సెల్: 9448125620**